క్లుప్తంగా

ఎన్‌హెచ్‌ఆర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమం



రెంటచింతల: విద్యాభివృద్ధికి, వివిధ రంగాల్లో నైపుణ్యం ప్రదర్శించిన వారిని ఎన్‌హెచ్‌ఆర్ ఫౌండేషన్ ప్రోత్సహించడం ప్రశంసనీయమని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సింహాద్రి మోహన్ అన్నారు. గురువారం స్థానిక గురుకుల పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణపురం హనుమంతు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మోహన్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్‌తో కలిసి విద్యార్థులకు పెన్నులు అందజేసి మాట్లాడారు. ముందుగా హనుమంతురావు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. దమ్మాలపాటి రామకోటయ్య, రవికిరణ్, పద్మావతి, సాయి ఈశ్వర్, లింగేశ్వర్, అనిల్, అశోక్, లక్ష్మీనారాయణ, నాగిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తోపుడు బండ్లు అందజేత



మాచర్ల: పురపాలక సంఘ పరిధిలోని కార్మికులకు మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబు గురువారం చెత్త సేకరణకు తోపు బండ్లను కార్మికులకు పురపాలక సంఘ కార్యాలయంలో అందజేశారు. పూర్తి స్థాయిలో చెత్త సేకరణ చేపట్టాలని సిబ్బందికి సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజా, మెప్మా ప్రాజెక్టు సీఓ రాజశేఖర్, కౌన్సిలర్లు చందూగౌడ్ పాల్గొన్నారు.

నేడు ఉన్నతాధికారుల పర్యటన

దాచేపల్లి : మండలంలోని పెదగార్లపాడు, తక్కెళ్లపాడు, తంగెడ గ్రామాల్లో ఉన్నతాధికారులు శుక్రవారం పర్యటిస్తారని తహసీల్దారు కేవీ కుటుంబరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చెట్టినాడు సిమెంట్, భవ్య సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల రైతుల పంటలకు నష్టం జరగడంతో పాటుగా భూములు కోల్పోయిన రైతులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని ఇటీవల జిల్లా కలెక్టర్‌కి బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ నియమించిన అధికారుల బృందం గ్రామాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, కలెక్టర్‌కి నివేదిక అందజేస్తుందని తహసీల్దార్ పేర్కొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతిపై విచారణ జరపాలి



మాచర్ల: పట్టణంలోని చర్చి పాస్టర్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో నిరసన ప్రదర్శన గురువారం నిర్వహించారు. రాజమండ్రి వద్ద మృతి చెందిన పాస్టర్ పి.ప్రవీణ్ మృతి కేసులో పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయా చర్చి పాస్టర్లు ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. మతోన్మాదుల దాడితో పాస్టర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. బస్టాండ్ సెంటర్ నుంచి భారీ స్థాయిలో వారు ఊరేగింపు నిర్వహించి నివాళులర్పించి నిరసన జరిపారు. ఈ ప్రదర్శనలో పాస్టర్లు పాల్గొన్నారు.

షిర్డి సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండలంలోని పాలువాయి జంక్షన్ షిర్డిసాయి మందిరంలో గురువారం ప్రధాన అర్చకులు గోపాల్ పాండే బాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనేక గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని, సాయినాథునికి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించగా భక్తులు తన్మయం చెందారు. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదాన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కేసానుపల్లి ఉప సర్పంచ్‌గా వెంకమ్మ

దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా చెట్టిపాగు వెంకమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవోపీఆర్డీ గుప్తా అధ్యక్షతన గ్రామ సచివాలయంలో గురువారం ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియ జరిగింది. పంచాయతీ వార్డు సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని, వెంకమ్మని ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉప సర్పంచ్ వెంకమ్మని టీడీపీ నేతలు నెల్లూరి రామకోటయ్య, నెల్లూరి కోటయ్య, కోట సాయికుమార్ తదితరులు అభినందించారు.

సన్మార్గానికి శిక్షణ రంజాన్

ముస్లింకు అత్యంత పవిత్రమైన మాసం రంజాన్. దీనిని దానధర్మాల మాసంగానూ చెబుతారు. ఇస్లాం మతబోధనల ప్రకారం జీవితాన్ని సన్మార్గంలో పెట్టేందుకు శిక్షణ పొందే మాసంగా రంజాన్ ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ మాసం.. అనంతరం 11 నెలల కాలంలో మనిషి సన్మార్గంలో జీవించే విధానాన్ని అలవరుస్తుంది. ఆరాధనల విషయంలో ఇస్లాం నిర్వచనం విభిన్నమైనది. విధిగా చేయాల్సిన నమాజ్, రోజా, జకాత్, ఫిత్రా వంటి సత్కార్యాలే కాకుండా అల్లా ప్రసన్నత కోసం ఖురాన్ పఠనం చేస్తారు. ఖురాన్‌లో చెప్పినట్టు చేసే ప్రతి మంచి పని దైవారాధన కిందకే వస్తుందని భావిస్తారు.

- దాన ధర్మాల నెల
- కఠోర ఉపవాస దీక్షలు
- ప్రత్యేక ప్రార్థనలు
- పేదలకు సాయం
- ఇఫ్తార్‌తో ప్రత్యేక అనుబంధం
- అంతా ఒక్కటే అనే భావన



ఉపవాసదీక్ష ముగిసిన తరువాత పండ్లు తింటున్న ముస్లిం సోదరులు

దాచేపల్లి : రంజాన్ మాసంలో చేసే సత్కార్యాలకు 70 రెట్లు పుణ్య ఫలం దక్కుతుందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం, నమ్మకం. ఈ మాసంలో ఒక్క రూపాయి దానం చేస్తే 70 రూపాయల చేసినంత పుణ్యం లభిస్తుందని చెబుతారు. అందు వల్లే ఈ మాసంలో ముస్లింలు ఎక్కువగా దానధర్మాలు చేస్తుంటారు. ఈ మాసంలో కఠిన ఉపవాసం చేస్తారు. సూర్యోదయానికి ముందు ఆహారం (సహర్) భుజించి దీక్షను చేపడతారు. మళ్లీ సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత కొద్దిపాటి ఆహారాన్ని(ఇఫ్తార్) స్వీకరించి దీక్ష విరమిస్తారు. ఇలా రంజాన్ మాసమంతా కఠిన ఉపవాసం పాటిస్తారు. ఇస్లాంలో దాన ధర్మాలు కీలకమైనవి. తమ వద్ద ఉన్న సంపద నుంచి జకాత్ చెల్లిస్తారు. సంపద విలువలో 2.5 శాతం లెక్కించి వచ్చే సొమ్మును పేదలకు పంచుతారు. బంగారం, వెండి, నగదు ఇలా వారి వద్ద ఉన్న వాటిపై నిర్ణీత సొమ్ముని జకాత్ ఇవ్వడం ద్వారా మిగిలిన సంపద శుద్ధి అయినట్లుగా ముస్లింలు భావిస్తారు. ఇది వారు తప్పనిసరిగా పాటించే నియమం. ఈ మాసంలో తప్పనిసరిగా పేదలకు ఇవ్వాల్సినది ఫిత్రా. రంజాన్ నెలంతా చేసే పుణ్య కార్యాలు, ప్రత్యేక ప్రార్థనలు అల్లా వద్ద అమోదం పొందాలంటే, ఈద్ నమాజ్ కన్నా ముందు ముందుగా ఫిత్రా ఖచ్చితంగా చెల్లించాలి. ఇంట్లో ఎంతమంది ఉంటే అందరి పేరిట ఫిత్రా తప్పనిసరిగా ఇవ్వాలి. అప్పుడు పుట్టిన బిడ్డ పేరున కూడా ఫిత్రా ఇవ్వాలని ముస్లిం పెద్దలు చెబుతున్నారు.

పేద, ధనిక సమానత్వం

రంజాన్ మాసం పేదలు, ధనికుల మధ్య తారతమ్యాలను చెరిపివేస్తుంది. పేద, ధనిక తేడా లేకుండా మసీద్‌లలో పక్క పక్కనే నిలబడి నమాజ్ చేయడం కనిపిస్తుంది. అందుకే పేదలు కూడా ధనికులతో సమానంగా పండుగ చేసుకోవాలనే ఉద్దేశంతోనే జకాత్, ఫిత్రా దానం చేయాలని ఇస్లాంలో తప్పని సరిచేశారు. ఈ మాసంలో హితోదికంగా దానధర్మాలు చేస్తూ ఖర్చుకి వెనుకాడరు.

ఇఫ్తార్ ద్వారా అందరు ఒక్కటనే భావన

కులాలు, పార్టీలకు అతీతంగా రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఇస్తుంటారు. ఏక మనస్సు, ఏక భావం కలిగి కులాలకు అతీతంగా జరిగే ఈ ఇఫ్తార్ విందు అందరి పట్ల సోదరభావం వాతావరణం కలిగిస్తుంది. ఇఫ్తార్‌లో అందరు ఒకే చోట చేరి కలిసి భోజనాలు చేయడం అదృష్టంగా భావిస్తుంటారు. శత్రువులైనా.. ఇఫ్తార్‌లో మిత్రులుగా ఉండి అంతా ఒక్కటే అనే భావన కలిగిస్తుంటారు.

దానంతో పుణ్యఫలం



రంజాన్‌లో రూపాయి దానం చేస్తే ఏడింతలు పుణ్యం లభిస్తుంది. అర్హుడైన ప్రతి ముస్లిం జకాత్ తప్పనిసరిగా ఇవ్వాలి. తాను ఉన్న ఇళ్లు కాక, ఇతర మార్గాల్లో వచ్చే ఆదాయంలో 2.5శాతం జకాత్‌గా చెల్లించాలి. పేదలు కూడా ధనికులతో సమానంగా పండుగ చేసుకోవటానికే జకాత్, ఫిత్రా చెల్లించాలి.

– షేక్ మహ్మద్‌జానీ, దాచేపల్లి

ఫిత్రా దానం చేయాలి



ఈద్ ఉల్ ఫితర్ నమాజ్‌కు వెళ్లే ముందు ప్రతి ముస్లిం తన పేరిట ఫిత్రా పేదలకు దానం చేయాలి. కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరి పేరు మీద ఫిత్రా తప్పనిసరిగా దానం చేయాలి.

– షేక్ సుభానీ, దాచేపల్లి

ఉపవాసం ఆధ్యాత్మికతను పెంపొందిస్తుంది



పవిత్ర రంజాన్ మాసంలో కఠిన ఉపవాసం ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందిస్తుంది. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం పచ్చి మంచినీళ్లు కూడా తాగకుండా..ఉపవాసం ఉండడం వల్ల అల్లా మనతోనే ఉన్నడనే భావన కలుగుతుంది. ఉపవాసం చేయడం కూడా ఆరోగ్యానికి మంచిది.

– షేక్ ఖాదర్‌బాషా, దాచేపల్లి

ఉపాధి హామీ పనులు సకాలంలో పూర్తి చేయాలి



మెడికల్ కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ కె. సరోజినిదేవి

రెంటచింతల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024–25లో చేపట్టిన పనులను ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.సరోజినిదేవి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. గ్రామాల్లో పంట కాల్వల పూడికతీత, సేద్యపు కుంటల తవ్వకం, పండ్లతోటలకు గుంతలు తీయడం వంటి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో మొత్తం 10,750 మందికి ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డులు అందజేయడం జరిగిందని తెలిపారు. రోజుకు కనీస వేతనం రూ.300 ఉపాధి కూలీలకు ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో అవసరమైతే మరికొన్ని పనులను చేపట్టేందుకు ఎఫ్‌ఏలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్, ఏపీవో జి.జయచంద్రతో కలిసి ఫీల్డ్ అసిస్టెంట్లకు మెడికల్ కిట్‌లను ఎంపీడీఓ పంపిణీ చేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వి.చంద్రకళ

పిడుగురాళ్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వి.చంద్రకళ కోరారు. పట్టణంలోని మున్సిపల్ వర్కర్స్ కాలనీ బ్రహ్మానందరెడ్డి నగర్‌లో కంపా వీరమ్మ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందరన్బంగా ఆమె మాట్లాడుతూ.. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం కార్మికులపై పని భారం పెంచిందని, రాజకీయ వేధింపులు పెరిగాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి కారణం లేకుండా గత 20 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కాంట్రగుంట మేరమ్మను తొలగించడం అన్యాయమన్నారు. ఆమెను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదే విధంగా కరోనా సమయం నుంచి పని చేస్తున్న ఐదుగురు కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని, వారికి రూ. 21 వేల జీతం అమలు చేయాలని కోరారు. వచ్చే నెల 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల సమస్యలపై ధర్నాలు, ర్యాలీలు జరుగుతాయని, దసలవారీగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్‌శాఖ మంత్రికి సంతకాలు సేకరణ చేసి, ఏప్రిల్ 10న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. అప్పటికి తేలకపోతే ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్లొచ్చని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు చిలక సునీత, మున్సిపల్ కార్మికులు కంభా కొండలు, ఉల్లిగడ్డ రామారావు, బత్తుల రామారావు, సేవరమ్మ, పార్వతి, అనంతలక్ష్మీ, అంకారావు, దేవరకొండ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఉప సర్పంచ్‌ల ఎన్నిక



రాయవరం ఉప సర్పంచ్‌కు ధృవీకరణ పత్రం అందజేస్తున్న ఈఓపీఆర్డీ



కోటేశ్వరమ్మకు ఎన్నిక ధృవీకరణ అందజేస్తున్న అధికారి

మాచర్ల రూరల్: మండలంలోని జమ్మలమడక, రాయవరం గ్రామ ఉప సర్పంచ్‌ల ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. జమ్మలమడక పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల ప్రత్యేకాధికారి పీఎస్‌రెడ్డి నేతృత్వంలో ఉప సర్పంచ్‌గా కొండా అక్కులును ఎన్నుకున్నారు. అలాగే రాయవరంలో ఉప సర్పంచ్‌గా పెండ్లి వెంకటకుమారి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు బిట్టు వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. రూరల్ సీఐ షేక్ నసీబ్ బాషా, ఎస్‌ఐ రవి కుమార్ ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

వేమవరం ఉప సర్పంచ్‌గా కోటేశ్వరమ్మ

మాచవరం: మండలంలో వేమవరం, పిన్నెల్లి, మాచవరం గ్రామాల ఉప సర్పంచ్ ఎన్నికల్లో వేమవరం ఉప సర్పంచ్‌గా ఇప్పాల కోటేశ్వరమ్మ (టీడీపీ) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు గురువారం తెలిపారు. వేమవరం గ్రామ పంచాయతీలో మొత్తం 12 మంది వార్డు మెంబర్లకు గానూ వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు 9 మంది, టీడీపీకి చెందిన ముగ్గురు వార్డు మెంబర్లుగా ఉన్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన నలుగురు వార్డు మెంబర్లు కోటేశ్వరమ్మకు మద్దతు ఇవ్వడంతో ఎన్నిక ఏకగ్రీవం అయింది. మాచవరం, పిన్నెల్లి గ్రామాల్లో వార్డు మెంబర్లు సమావేశానికి గైర్హాజరు కావడంతో ఎన్నిక రేపటికి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఐసీడీఎస్ జిల్లా పీడీ ఉమాదేవి

సత్తెనపల్లి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని స్త్రీ సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఉమాదేవి అన్నారు. పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన డివిజనల్ స్థాయి సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాల వలన అనేక అనర్థాలు జరుగుతాయని, ముఖ్యంగా బాలికలు చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆడపిల్లల రక్షణ కోసం ప్రవేశపెట్టిన చట్టాలు, పోక్సో చట్టం, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, ఎంఈవో–1 ఏ శ్రీనివాసరావు, ఎంఈవో–2 ఏ రాఘవేంద్రరావు, సత్తెనపల్లి, క్రోసూరు సీడీపీవోలు శ్రీలత, సరళాదేవి, ఏసీడీపీఓ సంతోష కుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రమీల మాట్లాడారు. ఈ సమావేశంలో చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, వైద్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్ హత్య కారకులను శిక్షించాలి



తహసీల్దార్ మధుకు వినతి పత్రం అందజేస్తున్న ఫాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

పిడుగురాళ్ల: రాజమండ్రి సమీపంలో ఫాస్టర్ ప్రవీణ్‌కుమార్ హత్య చేసిన వారిని వెంటనే గుర్తించి, శిక్షించాలని పిడుగురాళ్ల మండల ఫాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ సాగర్ అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ర్యాలీ నిర్వహించి, అనంతరం తహసీల్దార్ మధుకు, పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సువార్తికులపై కుడితి నీళ్లు పోయడం, పర్మిషన్‌లో ఉన్న సువార్త సభలను దౌర్జన్యంగా అడ్డుకోవటడం, చర్చిలపై దాడులు చేయడం సరికాదన్నారు. అదేవిధంగా ప్రవీణ్‌గారు కొన్ని టీవీ చానల్లో వేదాల గురించి మాట్లాడటం వాళ్ల కంటగింపుగా మారి ప్రవీణ్‌ని అంతమొదించాలనే ఉద్దేశంతోనే ఇలాంటి ఘాతకానికి పాల్పడి ఉంటారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

ఇది వైఎస్సార్ సీపీ కార్యకర్తల విజయం



డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: స్థానిక సంస్థల ఎన్నికలు వైఎస్సార్ సీపీ విజయం కార్యకర్తలదని ఆ పార్టీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 52 స్థానిక సంస్థల్లో జెడ్పీ చైర్మన్లు, ఎంపీపీ, వైస్ ఎంపీపీల ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో టీడీపీ 11 సీట్లు మాత్రమే కైవసం చేసుకుందని, వైఎస్సార్ సీపీ 30 స్థానాలను గెలుచుకుందని, 11 స్థానాలకు సంబంధించి సభ్యులు హాజరు కాకపోవడంతో కోరం లేక ఎన్నిక వాయిదా వేశారని చెప్పారు. కూటమి నేతలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, ప్రలోభాలకు గురి చేసినా లొంగకుండా నిలబడిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు విజయంగా ఈ ఎన్నికలను చెప్పుకోవచ్చునన్నారు. రాబోయే రోజుల్లో మరింత బలంగా ఎన్నికలుఎదుర్కొని జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఆయన పేర్కొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దుకు సహకరించాలి



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందిస్తున్న పట్టణ ముస్లిం నాయకులు

సత్తెనపల్లి: రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించాలని పట్టణ ముస్లిం నాయకులు కోరారు. గురువారం స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం ముస్లిం సమాజ ప్రయోజనాలకు, వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు హాని కలిగించేలా ఉందన్నారు. ముస్లిం సమాజం హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించడానికి, వక్ఫ్ ఆస్తులను నియంత్రించే ప్రస్తుత చట్టాల్లో ఎలాంటి మార్పు చేయకూడదని భావిస్తున్నామన్నారు. పార్లమెంట్‌లో సవరణ చట్టాన్ని తిరస్కరించి ముస్లింల ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ముస్లిం నాయకులు ఉన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

రంజాన్ మాసంలో కఠినమైన ఉపవాస దీక్షలు పాటించటం గొప్ప విషయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 27వ వార్డులో భారీ స్థాయిలో సత్తెనపల్లి ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ముస్లిం పేదలకు రంజాన్ తోఫా పంపిణీలో గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముస్లిం పేదలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ముస్లిం యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఈ–శ్రమ డెత్ పరిహారానికి దరఖాస్తుకు గడువు పొడిగింపు

సత్తెనపల్లి: అసంఘటిత కార్మికులు ఈ–శ్రమ గుర్తింపు కార్డు కలిగి 2021 ఆగస్టు 26 నుంచి 2022 మార్చి 31 లోపు ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి వైకల్యానికి గురైనా పరిహారం కోసం దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ అధికారి సీహెచ్ మూర్తి గురువారం తెలిపారు. ప్రమాదవశాత్తు మరణానికి రూ.2 లక్షలు, పూర్తి వైకల్యానికి రూ.లక్ష మంజూరు చేస్తారన్నారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ అధికారి పరిధిలోని వారు ఈ నెల 31 లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఈ–కేవైసీ తప్పనిసరి

పెదకూరపాడు: మండలంలో ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు పొందాలంటే ఈ కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని తహసీల్దార్ ధనలక్ష్మి సూచించారు. మండలంలో 4,269 మందికి గాను ఇంకా 3,486 మంది ఈ–కేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. మండలంలో ఈ కేవైసీ చేయించుకోని వారి లిస్టు డీలర్ల వద్ద ఉందని, సమీపంలోని రేషన్ డీలర్లను సంప్రదించి ఈ–కేవైసీ చేయించుకోవాలని తెలిపారు. మార్చి 31 వరకే ఈ అవకాశం ఉందని, ప్రతి ఒక్క రేషన్ లబ్ధిదారు వినియోగించుకోవాలని కోరారు.

విలేజ్ సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు

పెదకూరపాడు : మండలంలోని ఇరువురు విలేజ్ సర్వేలకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తహసీల్దార్ ధనలక్ష్మి గురువారం తెలిపారు. మండలంలోని పెదకూరపాడు సర్వేయర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ రెడ్డి, హుస్సేనగరం సర్వేర్‌గా పనిచేస్తున్న బెల్లంకొండ త్రివేణిలపై ఐవీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని లేనిపక్షంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

రుణ మేళాకు విశేష స్పందన

వెల్దుర్తి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన రుణ మేళాకు విశేష స్పందన లభించినట్లు ఎంపీడీఓ డి.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్‌ల ద్వారా రుణ మేళా నిర్వహించగా 184 పురుషులు, 96 స్త్రీలు మొత్తం 280 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా.. 215 మంది హాజరైనట్లు తెలిపారు. మండలంలోని వివిధ బ్యాంకులకు 40 యూనిట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బి.రామకృష్ణ, డి.అన్వేష్, ఎస్ మహేందర్‌రెడ్డి, షేక్ రబ్బాని, ఎ.షరీష్ హాజరయ్యారు.

వ్యాపార భూములను పరిశీలించిన ఆర్డీఓ



మాచర్ల రూరల్: పట్టణ శివారులోని రాయవరం జంక్షన్ వద్ద నిర్మిస్తున్న పెట్రోల్ బంకు, కల్యాణ మండపాల ఎన్‌ఓసీ పత్రాలను గురజాల ఆర్డీఓ వి.మురళీకృష్ణ గురువారం పరిశీలించారు. వ్యాపారులు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి, వాటిలో నిర్మాణాలు చేపట్టాలంటే ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకు, కల్యాణ మండపం భూమి రికార్డులను నిశితంగా పరిశీలించి పలు సూచనలందించారు. అనంతరం పట్టణంలోని శ్రీనివాస మహల్, రామాటాకీస్ థియేటర్‌లోని సౌకర్యాలను పరిశీలించి, లైసెన్స్ రెన్యువల్ చేయించారు. తహసీల్దార్ బి.కిరణ్ కుమార్, ఆర్‌ఐ ఇంటూరి అనిల్ కుమార్, పెట్రోల్ బంకు నిర్వాహకులు గుంటుపల్లి బాబి, శ్రీనివాస మహల్ యజమాని షేక్ జాని, వీఆర్‌ఓలున్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

మాచవరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించడం జరుగుతుందని ఏపీఓ వెంకటేశ్వర్లు నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి మండలంలోని అన్ని గ్రామాల్లో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించిన అనంతరం గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని, గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాల దృష్టికి వచ్చిన సమస్యలు, అభ్యంతరాలను ప్రజావేదికలో తెలియజేస్తారని తెలిపారు.

ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యం



మాచర్ల రూరల్: ఆర్థిక అసమానతలు తొలగాలంటే ఉన్నత విద్యతోనే సాధ్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని న్యూటన్స్ గ్రూఫ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల 24వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. పల్నాటి ప్రాంతంలో న్యూటన్స్ ఇంజనీరింగ్ కాలేజి స్థాపించి, వేలాది మంది విద్యార్థులకు విద్య, ఉపాధినందించిన కళాశాల యాజమాన్యం కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో న్యూటన్స్ గ్రూఫ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జగదీష్‌రెడ్డి, టీడీపీ యువ నాయకులు జూలకంటి అక్కిరెడ్డి, హెచ్‌ఆర్ జీఎం డాక్టర్ జి.రవి కుమార్ తదితరులున్నారు.

పూజలందుకోమ్మ.. పోలేరమ్మ

పెదకూరపాడు : కోరిన కోర్కెలు తీర్చే తల్లి పోలేరమ్మ... పాడిపంటలతో... సుఖశాంతులతో.. మా గ్రామాన్ని చల్లంగా చూడు తల్లి అంటూ.. మండలంలోని లగడపాడు గ్రామంలో గురువారం భక్తులు పోలేరమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా వేడుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. తిరునాళ్లలో ఏర్పాటు చేసిన ప్రభలు ఆకట్టుకున్నాయి. ఎస్సై గిరిబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.